క్లుప్తంగా

జేవీకే కిట్లు పంపిణీ



కొండపాటూరు(కాకుమాను): కొండపాటూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎంఈఓ కెఎఫ్.కెనడీ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనీఫాం, పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 విజయ్ భాస్కర్, హెచ్ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవం సుఖవంతం



కాకుమాను: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఓ గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కొండపాటూరుకు చెందిన గర్భిణికి పురిటినొప్పులు రావడంతో.. కుటుంబ సభ్యులు కాకుమాను పీహెచ్‌సీకు తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రవి ప్రసాద్.. మహిళా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణికి సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో వైద్య సేవలు అందిస్తునట్లు తెలిపారు. మండల ప్రజలు ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

గుంటూరు రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన పింకి(22), శివకు గత ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో నగర శివారులోని కోల్డ్ స్టోరేజ్‌లో కూలీ పనులు చేసుకుంటూ.. అంకిరెడ్డిపాలెం గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని భార్యభర్తలు నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భర్త పనికి పోగా పింకి ఫ్యానుకు ఉరివేసుకుంది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుర్తుతెలియని మృతదేహం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం పోలీసులు గుర్తించారు. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎం సమీపంలో సుమారు 40 సంవత్సరాల వయస్సుగల ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకునే సమయానికి అతను అప్పటికే మృతి చెందాడని సీఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురికి తరలించామన్నారు. మృతుడు కాలనీ సమీపంలో యాచక వృత్తి చేసుకుని జీవిస్తుంటాడని ఆచూకీ తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన కొత్తరెడ్డిపాలెం గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. కొత్తరెడ్డిపాలెం చెన్నారెడ్డికాలనీ సమీపంలోని దళితవాడకు చెందిన సోమా సూజత పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి.. పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో ఇంటిలోని వస్తు సామగ్రి, దస్తులు, నిత్యావసర వస్తువులు, ధృవీకరణ పత్రాలు ప్రమాదంలో కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దారు గోపాలకృష్ణ పరిశీలించారు. సూజత కుటుంబానికి ప్రభుత్వ నగదు సాయాన్ని, నిత్యావసర వస్తువులను తహసీల్దారు గోపాలకృష్ణ అందజేశారు. వీఆర్వో కొండలరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

తనిఖీలు అప్పుడు.. సంతకాలు ఇప్పుడు..!

- గ్రామ పంచాయతీల నుంచి ఈవోపీఆర్డీ కార్యాలయానికి తరలుతున్న రికార్డులు
- 'సాక్షి' కథనంతో ఆర్నెళ్ల తర్వాత హడావుడిగా రికార్డుల్లో సంతకాలు..
- విస్తుపోతున్న పంచాయతీ కార్యదర్శులు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: పంచాయతీ అధికారుల తీరు వివాదాస్పందంగా మారింది. ఎవరైనా అధికారులు తనిఖీలు చేసినప్పుడు అక్కడిక్కడే రికార్డులపై సంతకాలు చేయడం సహజం. కానీ ప్రత్తిపాడు పంచాయతీ అధికారుల రూటే సపరేటు. తనిఖీలు చేసిన ఆర్నెల్ల తరువాత, రికార్డులు తెప్పించుకుని ఇప్పుడు సంతకాలు పెట్టేస్తున్నారు. అదేమిటనుకుంటున్నారా.. అవును మరి.. ప్రత్తిపాడు ఈవోపీర్డీ మావులూరి మోషె కొద్ది నెలల కింద మండలంలోని కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, కొండేపాడు, వంగిపురం గ్రామ పంచాయతీల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో రికార్డులను పరిశీలించి సంతకాలు చేయవలసి ఉంది. కానీ అప్పుడు సంతకాలు చేయకుండానే వచ్చేశారు. ఇప్పుడు విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చేసిన తనిఖీలకు సంబంధించిన సంతకాలను ఎంచక్కా ఆర్నెళ్ల తరువాత చేస్తున్నారు.

'సాక్షి' కథనంతో కదలిక..

సాక్షి పత్రికల ఈ విషయమై.. కథనం రావడంతో.. పంచాయతీ అధికారుల్లో కదలిక మొదలయ్యింది. గ్రామ పంచాయతీల్లో ఈవోపీఆర్డీలు తనిఖీలు చేయడం లేదంటూ 'పంచాయతీల్లో తనిఖీలు తనఖా' శీర్షికను సోమవారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ తనిఖీలకు సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలంటూ జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో అధికారుల్లో కదలిక మొదలయ్యింది. ప్రత్తిపాడు ఈవోపీఆర్డీ ఆర్నెళ్ల కిందట చేసిన తనిఖీలకు సంబంధించిన రికార్డులు, తీర్మానాల పుస్తకాలు, ఎంబుక్స్, మినిట్స్‌ను పంచాయతీ కార్యాలయం నుంచి ఈవోపీఆర్డీ కార్యాలయానికి తెప్పించుకుంటున్నారు. అంటే ఆ పంచాయతీలో తనిఖీల సమయంలో చేయవలసిని సంతకాల ప్రక్రియను ఇక్కడ పూర్తి చేస్తున్నారన్న మాట. ఇందుకు సంబంధించి ఇప్పటికే రికార్డులు తెచ్చి ఈవోపీఆర్డీ కార్యాలయంలో ఇవ్వాలంటూ సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఈవోపీఆర్డీ ఆదేశాలు జారీ చేయడంతో పుస్తకాలు సార్, కార్యాలయానికి చేరుతున్నాయి.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో జాగ్రత్తలు పాటించాలి

పొన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ అధికారి వై.హరిహరనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న హరిహరనాథ్, తహసీల్దార్లు

చేబ్రోలు: హెల్తీ ఓటర్ల జాబితా రూపకల్పనలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి వై.హరిహరనాథ్ కోరారు. పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పత్యేక సంక్షిప్త సవరణ 2024కి సంబంధించి నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని, పొన్నూరు, చేబ్రోలు మండలాలకు చెందిన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా తయారీలో ఎన్నికల కమిషన్ అంశాలను అమలు చేయాలన్నారు. స్వచ్ఛీకరణలో బాగంగా ఓటర్ల జాబితాలో మరణించిన, శాశ్వత వలస, డూప్లికేటు ఓట్లు, వివాహానంతరం, సదరు పోలింగ్ కేంద్ర పరిధిలో కాక, వేరే ప్రాంతంలో నివాసం ఉన్నవారి ఓట్లను తొలగించాలన్నారు. 17 సంవత్సరాల పైబడి వయస్సు గల వారిని కూడా ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా తీసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు లు ఇంటింటి సర్వే చేపట్టి, తదనుగుణంగా రిజిష్టర్లను తయారు చేయాలన్నారు. పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు తహసీల్దార్లు శ్రీకాంత్ కేదార్నాథ్, పి.రత్నం, గోపాలకృష్ణ, డీటీ ఫణికుమార్, సీనియర్ అసిస్టెంట్ పి.ఆనందరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో మిరప విత్తనాలు

పెదకాకాని: రైతు భరోసా కేంద్రాల్లో మిరప విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి మంగళవారం తెలిపారు. వెనిగండ్ల రైతు భరోసా కేంద్రంలో ఆర్మూర్ వెరైటీ 33 ప్యాకెట్లు ఉన్నాయన్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.900ల చొప్పున విక్రయించడం జరుగుతుందన్నారు. ఆర్మూర్ వెరైటీ కావాల్సిన రైతులు 86393 90180 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

నేడు సంఘీభావ యాత్ర

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో పూరి జగన్నాథ్ రథయాత్రకు సంఘీభావ యాత్ర బుధవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరులోని కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మంగళగిరికి చెందిన ఇస్కాన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నుండి వీవీఐటీ కళాశాల వరకు ఐదు కిలోమీటర్ల మేర పూరి జగన్నాథ్‌ని రథయాత్రకు సంఘీభావ యాత్ర సాగుతుందన్నారు. ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

అక్రమంగా మద్యం విక్రేత అరెస్ట్



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని గ్రామశివారులోని ఓ బడ్డీ దుకాణంలో ఎనుముల రాజేష్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం స్పెషల్ బ్రాంచి ద్వారా పోలీసులకు అందింది. దీంతో పోలీసులు దుకాణంపై దాడి చేసి, పది క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కలగయ్య తెలిపారు.

తుమ్మలపాలెం సచివాలయంలో రిజిస్ట్రేషన్లు



గ్రామసభలో జాబితాను చదివి వినిపిస్తున్న తహసీల్దారు సిద్దార్థ

ప్రత్తిపాడు: రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జి. సిద్దార్థ అన్నారు. కొండజాగర్లమూడిలో స్వామిత్వలో గ్రామకంఠం భూములను సర్వే చేశారు. దానికి సంబంధించిన డ్రాఫ్ట్ ఆర్‌వోఆర్‌ను పబ్లిష్ చేసి అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో అభ్యంతరాలను తెలుసుకునేందుకు మంగళవారం కొండజాగర్లమూడిలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ప్రచురించిన జాబితాలోని పేర్లను గ్రామసభలో సెక్రటరీ శివాజీ చదివి వినిపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చుతో వైఎస్సార్ జగనన్న భూహక్కు భూరక్ష పథకం కింద గ్రామాల్లో అత్యాధునిక పరికరాలతో సర్వే చేపట్టిందన్నారు. తొలివిడతలో కొండజాగర్లమూడిలో సర్వే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. వచ్చే నెల నుంచి తుమ్మలపాలెం సచివాలయంలో రిజిస్ట్రేషన్లు జరగనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరుగ సుభాషిణి, సెక్రటరీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం వైద్య పరీక్షలు



ప్రత్తిపాడులో పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం

ప్రత్తిపాడు: ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమంపై వైద్యాధికారులు, సిబ్బంది తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వారి విధులను పక్కన బెట్టి, ఇతరుల విధులను నిర్వర్తిస్తున్నారు. నిలువరించాల్సిన వైద్యాధికారులు చోద్యం చూస్తుండగా, చర్యలు తీసుకోవలసిన జిల్లా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పబ్లిక్‌ను మొబిలైజ్ చేయాల్సి ఉంటుంది. ఎంఎల్‌హెచ్‌పిలు ఎఫ్‌పీసీకి వచ్చిన రోగులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ వైద్యాధికారుల ఉదాసీనత కారణంగా ఏఎన్ఎంలే పరీక్షలు చేస్తున్నారు. వాస్తవానికి ఎఫ్‌పీసీ కార్యక్రమంలో ఎవ్వరి విధులు ఏమిటన్నది స్పష్టంగా ప్రభుత్వం తెలియజేసినా, క్షేత్ర స్థాయిలో మాత్రం వైద్యాధికారుల తీరుతో ఒకరి విధులను మరొకరు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

ఎంఈఓ, ఎంఈఓ-2 బాధ్యతల స్వీకారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల విద్యాశాఖాధికారిగా జి.సత్యనారాయణమూర్తితోపాటు ఎంఈఓ-2 డి.నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జి.సత్యనారాయణమూర్తిని, డి.నాగేశ్వరరావులను ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.జోజప్ప, మండల శాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బి.సురేష్ బాబు, ఎల్.రవీంద్రరావు, గౌరవాధ్యక్షులు ఎస్.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ అభినందనలు

ఎంఈఓ జి.సత్యనారాయణమూర్తి, ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరించిన డి.నాగేశ్వరరావులను యూటీఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు ఆనంద్‌కుమార్, సుబ్బారావులు మంగళవారం కలసి అభినందించారు. అనంతరం వారిని సత్కరించారు. జిల్లా నాయకులు ఆంజనేయులు, ధనరాజారావు, రాధాకృష్ణ, షంషాద్ బేగం, అన్నపూర్ణ, విజయరాణి, సుధారాణి, సుజాత, బురాన్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



చంద్రావతి మృతదేహం

తెనాలిరూరల్: అనారోగ్యంతో బాధపడుతూ చూసేవారు ఎవరూ లేకపోవడంతో ఆవేదన చెందిన ఓ మహిళ ఆత్మహత్యకి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని కాల్వలోకి దూకి ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. గుంటూరు వెంకట్రావు నగర్ 4వ లైనుకు చెందిన మద్ది చంద్రావతి(54) క్యాన్సర్ ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంది. మంగళవారం వేజెండ్ల నుంచి తెనాలి ఆర్టీసీ బస్సులో జాగర్లమూడి గ్రామం వద్దకు చేరుకుంది. గ్రామంలోని కొమ్మమూరు కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికంగా పనులు చేసుకుంటున్న రైతులు గమనించి బయటకు తీసినా అప్పటికే మృతి చెందింది. చంద్రావతి తన పుట్టిల్లు అయిన స్వగ్రామం వేజండ్లలో గ్రామంలో ఉంటూ వైద్య సేవలు పొందుతోంది. ఇంట్లో ఉన్న భార్య కనిపించకపోయే సరికి భర్త నరసింహారావు ఆమెను వెతుక్కుంటూ ఆందోళన గురయ్యారు. సంగం జార్లముడి కాలువలో మహిళా ఆత్మహత్య ఘటన తెలుసుకుని ఆయన అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రణాళిక బద్ధంగా చదివితే ప్రతి విద్యార్థి ఒక ఆణిముత్యమే



కసుకుర్తి జయశాలిని సత్కరిస్తున్న సర్పంచ్ పవన్‌కుమార్, హెచ్ఎం శివపార్వతి

తెనాలిటౌన్: ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఒక ఆణిముత్యమేనని నందివెలుగు గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గత ఏడాది పదో తరగతిలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అభినందన సభ ఏర్పాటు చేశారు. మండలంలో 569 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన నందివెలుగు జాషువానగర్‌కు చెందిన కసుకుర్తి జయశాలిని సర్పంచ్ పవన్‌కుమార్, హెచ్ఎం శివపార్వతిలు సత్కరించి జ్ఞాపికలు, ప్రశాంస పత్రాలు అందజేశారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి అధ్యక్షత వహించారు. సభలో సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆణిముత్యాలుగా పిలవడం సముచితంగా ఉందన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామకృష్ణ, కసుకుర్తి దానియేల్, కమాదుల స్వామి, ధూళిపాళ్ళ దుర్గాప్రసాద్, కసుకుర్తి జోసఫ్, జంపని చంటి, అరుణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరణ

తాడేపల్లిరూరల్ : త్రిపుర రాష్ట్రంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలపైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు విమర్శించారు. దాడులకు గురై, నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కొలనుకొండ జాతీయ రహదారి పక్కన వ్యాపార సముదాయాల వద్ద సహాయ నిధి సేకరణ చేపట్టారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం లభ్యం

మంగళగిరి: క్షణికావేశంలో పాడుబడిన బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువకుని మృతదేహం మంగళవారం లభ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రైస్‌మిల్ వీధికి చెందిన శిఖా గోపాల్ (35) సోమవారం సాయంత్రం క్షణికావేశంలో తన నివాస గృహం సమీపంలోని పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బావిలోకి దిగి గోపాల్‌ను రక్షించే సాహసం చేయలేకపోయారు. అప్పటికే చీకటి పడటంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలు కొనసాగించలేకపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం గజ ఈతగాళ్లను రప్పించి గాలించారు. పాడుబడిన బావిలో చెత్త చెదారంతోపాటు పాత చెట్టు కొమ్మలు కొట్టేసి వేశారు. నీటిలో అడుగున ఉన్న చెట్టు కొమ్మల మధ్యలో గోపాల్ ఇరుక్కుపోయి మృతి చెందాడు. బావి మొత్తం పాచితో పాకుడు పట్టింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అతికష్టం మీద గోపాల్ మృతదేహాన్ని గజ ఈతగాళ్లు ఎంతో శ్రమించి బయటకు తీశారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్షల ఆధారంగా విత్తుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గుంటూరు రూరల్: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తద్వార విత్తుకుంటే తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. మట్టినమూనాలు సేకరించే విధానం రైతులకు వివరించారు. అధిక రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గి భూమి చౌడు బారుతుందని వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.శ్రీవాణి భూసార పరీక్షలకు మట్టినమూనాలు సేకరించే విధానాలు, ఏవిధంగా మట్టి నమూనాలు తీసుకోవాలి, ఎంత లోతులో తీసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు, ఎస్‌హెచ్‌ఈ యాప్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ ఆనందబాబు, రైతులు వంగా నవీన్ రెడ్డి, నామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు కార్డుతో బహుళ ప్రయోజనాలు



రైతులకు వివరిస్తున్న ఏవో అరుణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుభాని

యనమదల (ప్రత్తిపాడు): కౌలు కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి అన్నారు. యనమదలలో మంగళవారం సీసీఆర్‌సీ గ్రామ సభను నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కౌలు రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలంటే కౌలు కార్డు తప్పనిసరని చెప్పారు. కౌలు రైతులు రైతు భరోసా, పంట నష్ట పరిహారం పొందాలంటే తప్పనిసరిగా కౌలు కార్డు ఉండాలన్నారు. కార్డులు కావలసినవారు ఫోటో, ఆధార్ కార్డు, భూ పత్రాల నకళ్లు, యజమాని అంగీకారంతో సంబంధిత రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని ఏవో అరుణ కోరారు. కేవలం 9 నెలల కాలపరిమితితో మాత్రమే కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్న విషయాన్ని భూయజమానులు, కౌలు రైతులు గమనించాలని చెప్పారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కౌలురైతుకు గుర్తింపు కార్డు

పెదనందిపాడు: ప్రతి కౌలురైతుకు భూ యాజమాని అంగీకారంతో కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తహసీల్దారు సుభాని అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి 3,433 మంది కౌలురైతు గుర్తింపు కార్డులు అందజేయాలని తహసీల్దారు తెలిపారు. అర్బికేల్లో 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నారని, రైతులు వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బి.సుధారాణి, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెంలో వరిగడ్డి వాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

తెనాలిరూరల్: తెనాలి మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన పాడి రైతులు కుర్రా శివరామకృష్ణ ప్రసాద్, కుర్రా సీతారామయ్యలకు చెందిన వరి గడ్డివాములు ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. సోమవారం సాయంత్రం సమయంలో విద్యుత్ తీగలకు రాపిడి జరిగి నిప్పురవ్వలు చెలరేగి గడ్డివాములపై పడడం వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. నిప్పురవ్వలు గడ్డివాములపై పడడంతో ఒక్కసారిగా బారీగా మంటలు చెలరేగాయి. భారీ ఎత్తున మంటలు, పొగలు అలముకోవడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తూనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సోమవారం రాత్రి నుంచి మంటలను ఆర్పుతూనే ఉన్నారు. శివరామకృష్ణ ప్రసాద్ కు చెందిన 13 ఎకరాల గడ్డివామి, సీతారామయ్యకు చెందిన 12 ఎకరాల గడ్డివామి అగ్నికి పూర్తిగా ఆహుతయ్యాయి. సోమవారం సాయంత్రం చెలరేగిన మంటలు, పొగ మంగళవారం మధ్యాహ్నం వరకూ కొనసాగడంతో అగ్నిమాపక సిబ్బంది 20 గంటలకు పైగా అక్కడే ఉండి మంటలను అదుపుచేస్తూ ఉన్నారు. నిరంతరాయంగా శ్రమించి అతి కష్టం మీద మంటలు, పొగను అదుపు చేయగలిగారు. చుట్టుపక్కల నివాసాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అందరినీ అప్రమత్తం చేశారు. ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు, స్థానికులు తెలిపారు. మరోవైపు అగ్ని ప్రమాద బాధితులను మంగళవారం రైతు సంఘ నాయకులు పరామర్శించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి తదితరులు బాధిత పాడిరైతులను పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన పాడిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రమాదం కారణంగా మూడు లక్షల దాకా ఆస్తినష్టం జరిగిందని, గడ్డివాములు దగ్ధం కాగా మిగిలిన బూడిద తొలగించడానే వారికి రూ. 5 వేల దాకా ఖర్చు అవుతుందని అన్నారు.

150 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం



దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ముగ్గురోడ్డు మహిళలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నివాస స్థలాల పట్టాలు పొందిన మహిళలు మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు సెంటర్‌లో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ముగ్గురోడ్డు ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 150 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాట ప్రకారం ముగ్గురోడ్డులో ఇళ్లలేని నిరుపేదలతోపాటు రైల్వేస్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పట్టాలు పంపిణీ చేశారని, మరో ఆరు నెలలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇత్తడి పండు, జి.హైమావతి, రాణి, తిరుపతమ్మ, గోపి రవీంద్ర, ప్రభాకర్, నాగభూషణం, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నాం



ఇరవై ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నాం. రాజధానిలో కట్టిన టిడ్కో ఇళ్లకు సైతం దరఖాస్తు చేసుకున్నాం. అప్పట్లో కొంతమందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పుడు మా వాడకట్టులో ఎవరికైతే సొంత ఇల్లు లేదో, ఎవరైతే రైల్వే స్థలాల్లో ఇళ్ల వేసుకున్నారో వారందరికీ ఇళ్లస్థలాలు కేటాయించారు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

– వరగాని సుబ్బులు

ఎస్ఐ గిరిబాబు బాధ్యతల స్వీకారం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు మరో ఎస్ఐను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వట్టిచెరుకూరులో ఎస్ఐగా పనిచేసిన జి.గిరిబాబు కొంతకాలం లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. ఇప్పుడు తాడేపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.